క్లుప్తంగా

పెద్దింట్లమ్మకు వెండి సమర్పణ



పెద్దింట్లమ్మకు వెండిని సమర్పిస్తున్న భక్తులు

పెనుగొండ: మండలంలోని చెరుకువాడలో వేంచేసియున్న శ్రీపెద్దింట్లమ్మకు భక్తులు రెండు కిలోల వెండిని సమర్పించారు. వెంకటరామపురం గ్రామానికి చెందిన వంకమామిడి శ్రీనివాస రమేష్ కిరీటీం, 4 భుజాలతో కూడిన హస్తాలు మొత్తం సుమారు 2 కిలోల బరువు కలిగిన 5 వెండి ఆభరణాలను సమర్పించారని ఆలయ కార్య నిర్వహణాధికారి డి.పుష్పభాను తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి పట్టణ వాకర్స్ క్లబ్ తన వంతు సహాయ సహకారాలు అందిస్తుందని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. గురువారం పట్టణంలోని 17వ వార్డుకు చెందిన టి.సుబ్రహ్మణ్యం కాలుకు ఇన్ఫెక్షన్ వచ్చి మోకాలి వరకూ తొలగించడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాచారం తెలుసుకొని వారి కుటుంబానికి రూ.4 వేల విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మానెం బసవరాజు, పీర్ సాహెబ్, పోతుల ఉమాశంకరరావు, జవ్వాజి కళ్యాణ్, కర్రి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనరేటర్ బ్యాటరీ దొంగతనం

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామంలో గత నెల 5వ తేదీన జనరేటర్ బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయినట్లు జనరేటర్ యజమాని షేక్ అక్బర్ ఆలీ గురువారం ఫిర్యాదు చేసినట్లుహెడ్ కానిస్టేబుల్ డీవీ.రమణ చెప్పారు.చిలకలూరు పేట మండలం పోతవరం గ్రామానికి చెందిన అక్బర్ ఆలీ కుప్పనపూడి గ్రామంలో నివాసం ఉంటూ చెరువులకు జనరేటర్లు అద్దెకు ఇస్తున్నారని, గత నెల 5వ తేదీన గ్రామంలోని ఖాళీ ప్రదేశంలో జనరేటర్ ఉంచి తెల్లవారిన తరువాత చూసే సరికి జనరేటర్‌లో నాలుగు బ్యాటరీలు దొంగిలించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెప్పారు.గత కొన్ని రోజులుగా వాటి గురించి ఆరా తీయగా ఎక్కడా లభించకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు.కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు వివరించారు.

యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ద్వారా స్ఫూర్తి పొందాలి



భీమవరం ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న అరవిందస్వామి

భీమవరం: యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమం ద్వారా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు స్ఫూర్తి పొందాలని భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి పి అరవిందస్వామి అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ముందుగా ఈ పోర్టల్‌లో నమోదు చేసుకొని నూతన ఆవిష్కరణలు, ఆలోచనలను దాంట్లో అప్లోడ్ చేయాలన్నారు. మెరుగైన వాటికి నగదు పురస్కారాలు, ఆర్థిక సహాయం అందజేస్తారని ప్రభుత్వం యువతలో నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక నాయకత్వం వంటి సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ పోర్టల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వికెజె ప్రసూన, కో ఆర్డినేటర్ ఎస్ లక్ష్మీకాంతం, అధ్యాపకులు కాకుమాని శ్రీనివాసరావు, ఎల్.నర్సింహారావు, జి.ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా సుదర్శన హోమం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో మావుళ్లమ్మ దేవస్థానంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఉచిత మహా సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ సిబ్బంది కలిసి ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. శుక్రవారం జరిగే మహా సుదర్శన హోమంలో భక్తులు పాల్గొనాలన్నారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో?

- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, వితంతువులు
- ఏడాదైనా మొదలు కాని దరఖాస్తుల స్వీకరణ
- వితంతు పింఛన్ల మంజూరులోనూ మెలిక

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్న దాఖలాల్లేవు. చివరకు ఏ దిక్కూ లేని వృద్ధులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేయడం లేదు. దీంతో పలువురు అర్హులు ఇంకెప్పుడు పింఛన్ ఇస్తారంటూ సచివాలయాల చుట్టూ కళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇటీవల స్పౌజ్ కేటగిరిలో పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే మాత్రమే భార్యకు బదిలీ చేస్తున్నారు. పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నారు. అలాగే పలు సామాజిక పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వారిని కూడా పట్టించుకోవడం లేదు. నరసాపురం మండలంలో ప్రస్తుతం 10,773 మంది సామాజిక పింఛన్‌దారులు ఉన్నారు.

అమలు కాని హామీ

నరసాపురం మండలంలో అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో మొత్తం 28 పంచాయతీలు, 24 సచివాలయాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి 50 ఏళ్లకే పింఛన్లు అందజేస్తామని ఎన్నికల సమయంలో కూటమి సర్కారు హామీ ఇచ్చింది. అయితే, ఇంత వరకు దీనిని ఆచరణలో పెట్టలేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తుందో కూడా ప్రకటించలేదు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మాత్రం కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆశగా సచివాలయానికి వస్తున్నారు. ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని వారికి సచివాలయ సిబ్బంది సమాధానం చెబుతుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. అలాగే కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లినా పై సమాధానమే వస్తోంది.

గత ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లోనే కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం ఆయా సైట్లను సైతం నిలిపివేయడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైన వారు నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బంది పడుతున్నారు. పింఛన్ల మంజూరులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుసరించిన విధానమే సరైందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. గతంలో వలంటీర్లు ఇంటి వద్దే పింఛన్ అందించేవారు. భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మరుసటి నెలలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకునేవారు. అదే విధంగా ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్ల మంజూరుకు అవకాశం కల్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకపోవడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా 50 ఏళ్లు దాటిన వారు, అర్హత ఉండి ఫించన్లు అందని వారు ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీలు ఇచ్చుకుంటున్నారు.



పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి



నా భర్త ముప్పిరి శాంత రాజు వికలాంగ పింఛన్ తీసుకుంటూ 2024 మే నెలలో అనారోగ్యంతో మృతి చెందాడు. నేను కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. భర్త చనిపోయి జీవనోపాధి కోల్పోయిన నాకు వితంతు పింఛన్ రావడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తామంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మొన్న జూన్‌లోనే పెంచిన డబ్బులు ఇస్తామన్నారు ఇంకా ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి పింఛన్ మంజూరు చేయాలి.

–ముప్పిరి పద్మ, కొప్పర్రు పెద్ద పేట

దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే పింఛన్లు అందజేస్తాం



సామాజిక పింఛన్ దారుడు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగి రిలో పింఛన్ మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2023 డిసెంబర్ నెల నుండి ఏడాది మే నెల వరకు పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన లబ్ధిదారుల భార్యలు పింఛన్ల కోసం ముందు చేసుకున్న వారికి పింఛన్లు మంజూరయ్యాయి. ఒకటో తారీకు నుండి వారికి కూడా పెన్షన్లు అందజేస్తాం.

–గాదిరాజు రామకృష్ణంరాజు, ఎంపీడీవో నరసాపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలను తొలగింపు నిమిత్తం వాటిని తొలగించే ప్రక్రియలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో శ్రీరామ్‌పేట, కోడిగట్టు, కుళాయి చెరువు గట్టు ఏరియాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే పోడూరు మండలంలో జగన్నాథపురం, కవిటం, కవిటం లాకులు, మట్టపర్రు, వేడంగి, వేడంగిపాలెం, అన్నపూర్ణమ్మ పేట, యలమంచిలి మండలంలో కాజ ఈస్ట్, చించినాడ, పాలకొల్లు మండలంలో కాపవరం, వాలమర్రు, వడ్లపానిపాలెం, గొల్లవాని చెరువు, జిన్నూరు పాలెంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: యలమంచిలి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కాజా ఫీడర్‌కు వెళ్లే లైన్ మీద చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాజా తూర్పు, చించినాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఈఈ కె.మధుకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్ర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నత్తారామేశ్వరం, జుత్తిగ, మల్లిపూడి, ఎస్.ఇల్లిందలపర్రు గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ జి.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పెనుమంట్ర: మానవతా సంస్థ మండల శాఖ నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మానవతా సంస్థ జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణమూర్తి గురువారం ప్రటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నూతన కార్యవర్గం మార్టేరులో దేవాంగుల సంక్షేమ భవనంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. మానవతా మండల అధ్యక్షుడిగా సీరం విశ్వనాథం, కార్యదర్శిగా బండి ప్రసాద్, కోశాధికారిగా అమృత వాక్కుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ వెంకట నరేంద్ర, సహాయ కార్యదర్శిగా చిర్ల వంశీ హరినాథరెడ్డి ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు మానవత సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెనుమంట్ర: మండలంలోని పాలమూరు గ్రామంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పెనుమంట్ర పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్తి సంతోష్‌రెడ్డి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా తహసీల్దార్ వై.రవికుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి ఎస్‌వీ సూర్యనారాయణ, పీహెచ్ఎస్ వెంకటరమణ, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు పటిష్టంగా పనిచేయాలి

యలమంచిలి: వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీలు పటిష్టంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. ఏనుగువానిలంక గ్రామంలో గురువారం నిర్వహించిన పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడంలో ఇప్పటికే కూటమి ప్రభుత్వం వెనుక పడిందన్నారు. అమలు చేసిన పథకాలు కోతలు పెట్టడంతో ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల తరపున పోరాటం చేయాలని గోపి కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉచ్చుల స్టాలిన్‌బాబు, ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి, నాయకులు పాలంకి శ్రీనివాసరావు, ఇలపకుర్తి నరసింహారావు (పండు), పాతూరి రంగరాజు, రావూరి రామకృష్ణ, పాలపర్తి ఇమ్మానుయేలు, పాలపర్తి సందీప్, మల్లుల కొండ, ఉల్లంపర్తి జాన్, దిడ్ల కుమార్, బళ్ల నాగేశ్వరరావు, కాకుమళ్ల ఆంజనేయులు, వీరా ఉమా శంకర్, నల్లి నరేష్, గుడాల సురేష్ , గొలికారి తాతాజీ, పోలుకొండ వెంకట్, కొయ్యే నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమైన పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

వచ్చే నెలలో చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటు చేస్తాం

పాలకొల్లు సెంట్రల్: జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 7వ తేదీన చేనేత వస్త్రాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చేనేత కులాల సమాఖ్య అధ్యక్షుడు వట్టం గణేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక వీవర్స్ కాలనీలో వీవర్స్ కమ్యూనిటీ హాలులో చేనేత కులాల సమాఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణేశ్వరరావు మాట్లాడుతూ ఆగష్టు 7వ తేదీన జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా స్టాల్స్ ఏర్పాటు చేయడం, ప్రతిభ కలిగిన చేనేత విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం, చేనేత జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి నీలంశెట్టి సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, శాఖా రాంబాబు, బాసిన సత్యనారాయణ, యర్రా శివాజీ, బాసిన గునేశ్వరరావు, బొండపల్లి చంద్రశేఖర్, సూదా కాంతారావు, శిద్దాని మల్లేశ్వర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చేనేత కార్మిక సభ్యులు

రహదారి నిర్మించండి మహోప్రభో..

పెనుగొండ: శ్రీనగరేశ్వర స్వామి కాలనీ (బీడు)లో సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నా ఆ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని కాలనీ ప్రజలు ఆందోళన చేపట్టారు. గురువారం కాలనీలో పర్యటించిన సీపీఎం పెనుగొండ మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కాలనీ ప్రధాన రహదారి నిర్మించాలని పలుమార్లు ప్రజలు విన్నవించుకున్నా పట్టించకపోవడం దారుణమన్నారు. పంచాయతీ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, ఎమ్మెల్యే నిధులతో రహదారులు, వీధి లైట్లు, తాగునీరు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉండగా గ్రామ పంచాయతీ పట్టించుకోవడం దుర్మార్గమన్నారు. రాత్రి సమయంలో వీధిలైట్లు లేక ప్రజలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మించాలని కోరుతున్న కాలనీవాసులు

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం కలుషితం

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణంలోని వైఎన్ కళాశాల సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణం కలుషితం అవుతుందని, తద్వారా అనేక రకాల ఇబ్బందులను మనం ఎదుర్కొంటున్నామన్నారు. కావున ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని నిరోధించి, గుడ్డ సంచులను వాడాలని, విస్తరాకులు, మట్టి పాత్రలు పేపర్ ప్లేట్స్ వంటివి వినియోగించి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బెజవాడ వెంకటరత్నం, డాక్టర్ కేఎస్‌వీ రంగారావు, డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, హెచ్ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, డాక్టర్ అప్పన ఫణి, డాక్టర్ మల్లేశ్వరరావు, డాక్టర్ వరలక్ష్మి, సౌజన్య, కుసుమ, సుజిత, తదితరులు పాల్గొన్నారు.



గుడ్డ సంచులను పంచుతున్న అధికారులు

ఆక్రమణల తొలగింపును ఆపండి

ఆకివీడు: ఆక్రమణల తొలగింపును నిలుపుదల చేసి, బాధితులకు పట్టాభూములు ఇవ్వాలని మండలంలోని అజ్జమూరు గ్రామంలోని కాల్వ గట్టు ఆక్రమణదారులు మొరపెట్టుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధిత మహిళలు మాట్లాడుతూ గత 40,50 ఏళ్లుగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని, తమకు ఏ దిక్కూలేదని వాపోయారు. రెక్కాడితే గాని డొక్కాడని తమ బ్రతుకులపై ఈ విధమైన చర్యలు తీసుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కల కష్టంపై కట్టుకున్న ఇళ్లను కూల్చివేయాలనుకోవడం సమంజసం కాదని వాపోయారు. ప్రభుత్వం తమకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించుకునేందుకు రుణ సదుపాయం కల్పిస్తే ఇక్కడ నుంచి వెళ్లిపోతామని వారు తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అజ్జమూరు కాలువ గట్టు వాసులు

దళితులకు దూరంగా అంగన్‌వాడీ కేంద్రం



ఓసీ ఏరియాలోని రేకుల షెడ్డులో ఏర్పాటు చేసిన ఎస్సీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రం



ఎస్సీ ఏరియాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం

పెనుమంట్ర: వెలగలవారిపాలెంలో దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక దళితవాడలో అద్దె భవనం దొరక్క దళితులకు దూరం చేశారు. ఈ గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఒకటి ఓసీ ఏరియాలో ఎలిమెంటరీ పాఠశాల భవనంలోనూ, మరొకటి దళితవాడలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లోనూ, మూడోది తాళ్ల చెరువులోని ప్రభుత్వ పాఠశాల భవనంలోనూ ఏర్పాటు చేశారు. అయితే ఎస్సీ కమ్యూనిటీ హాల్ అసౌకర్యంగా ఉందనే సాకుతో రెండేళ్ల క్రితం ఒక ప్రజాప్రతినిధికి చెందిన అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనంలో ఏర్పాటు చేశారు. అక్కడ విద్యాశాఖ అధికారులు అభ్యంతరం తెలపడంతో పక్కనే ఉన్న మరో అద్దె భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించారు. కొద్ది రోజుల్లోనే ఇంటి యజమాని ఖాళీ చేయించడంతో మళ్లీ ప్రజా ప్రతినిధి ఇల్లే దిక్కైంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మూడు నెలల క్రితం ఓసీ ఏరియాలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రంలో దళిత వాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులు విలీనం చేశారు. ఇంటి యజమాని అభ్యంతరం చెప్పడంతో అక్కడి నుంచి ఓసీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రాన్ని వెలమపేటలోని మరో నూతన భవనంలో ఏర్పాటు చేసుకున్నారు. దళితవాడ కేంద్రాన్ని ఓసీ ఏరియాలోని రేకుల షెడ్‌లో దళితవాడకు దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో ఈ అంగన్‌వాడీ కేంద్రానికి దళితులు తమ పిల్లల్ని పంపడానికి నిరాకరిస్తున్నారు. తమ అంగన్‌వాడీ కేంద్రాన్ని పేటలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే ఏర్పాటు చేయాలని అధికారులను దళితులు కోరుతున్నారు.

చదరంగంతో మేధోశక్తి మెండు

పాలకొల్లు సెంట్రల్: చదరంగంతో మేధోశక్తి పెరుగుతుందని నరసాపురం ఆర్‌డీవో దాసి రాజు అన్నారు. గురువారం నరసాపురం ఆర్‌డీవో కార్యాలయంలో చదరంగం పోటీల బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. చదరంగం నిర్వాహకులు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న యూరో కిడ్స్‌లో భీమవరం అనసూయ చెస్ అకాడమీ, పశ్చిమ గోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పట్టణ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

19న జిల్లా స్థాయి పోటీలు

నరసాపురం రూరల్: ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఈ నెల 19న నరసాపురంలో జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. భీమవరం పట్టణానికి చెందిన అనసూయ చెస్ అకాడమీ, పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్లను నరసాపురం ఆర్డీవో దాసిరాజు గురువారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. నరసాపురం సంసిద్ స్కూల్‌లో పోటీలు జరుగనున్నాయని ప్రిన్సిపాల్ దుర్గా లావణ్య తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని వారు ఆకాంక్షించారు.



చదరంగం పోటీల బ్రోచర్‌ను విడుదల చేసిన ఆర్‌డివో దాసి రాజు

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతం పరిశీలన

నరసాపురం రూరల్: నరసాపురం ప్రాంత ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న చిన్న మామిడిపల్లి రైల్వే గేటు సమస్య తీరనుంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెళ్లే విధంగా (ఎఫ్ఓబీ) ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించేందుకు రైల్వే శాఖ ఆమోదించింది. దీంతో ఈ పారంతాన్ని ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ ఐతం సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఏఈ ప్రసన్నబాబు, అధికారులు, సిబ్బంది, తదితరులు గురువారం ఎఫ్ఓబీ నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు.

పెట్టుబడిదారుల ప్రయోజనాలకే లేబర్ కోడ్లు



ప్రచార యాత్ర నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుమంట్ర: కార్మిక హక్కులను కాలరాస్తూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరావు అన్నారు. గురువారం లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు గ్రామంలో ప్రచార జాతా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్, జిల్లా కార్యదర్శి ఎ.అజయ్‌కుమారి, కర్రి నాగేశ్వరరావు, సీఐటీయూ పెనుమంట్ర మండల కార్యదర్శి కోడి శ్రీనివాసప్రసాద్, సివిల్ సప్లై హమాలి కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.